192) బౌళి/రాగమాలిక

*****************************************************************************************************

శ్రీఅన్నమాచార్య సంకీర్తనములు ( ద్వితీయ భాగము - 1000 కీర్తనలు )
*Documented by: Sree Rama Chandra Murty Sistla (Sree Sist*
*****************************************************************************************************

ప|| తెలిసినమాటలు నీసముఖంబున దీకొని నిన్నడుగకపోదు |
సులభుడ వన్నిట ప్రాణనాథుడవు చొప్పుగ నాగతి యియ్యగదే ||
చ|| నీవే బలవంతుడవో నీకంటే గర్మము బలువో |
కైవసముగ నే నెంచిచూచితే కర్మముకంటె బలుపుడవు |
భూవలయంబుల ప్రారబ్ధంబులు భోగించవలెనని యంటినా |
వావిరి నిట్లైతే నీదేవత్వమునకు వెలితిగదే ||
చ|| ఐనాగానీలోకములోపల నది నీయాజ్ఞని తలచితిమా |
నేను నీశరణు చొచ్చినమీదట నీవే పరిహరించగవలదా |
కానిపించె నాకిక నొకబుద్ధి కర్మముపై నెప మటువేసి |
పూనుచు గాలక్షేపంబునకై భువిని వినోదము గాబోలు ||
చ|| యెందాకా జీవులతోడుత నీ వేలాటంబులు జరపెదవు |
అందరికిని నీవే తల్లిదండ్రివి అయి రక్షింపుచున్నాడవు |
కందువ దెలిసెను శ్రీవేంకటేశ్వర కర్తవెట్టు చేసిన మేలు |
చందమాయ నిది దగవౌ నీకును సంతోషించితి మిటు నేము ||